# "మా తెలుగుతల్లికీ మల్లెపూ దండ"

మన ఆంధ్రలో పల్లెటూళ్ళు తెలిసో తెలియకో సానిదానిలా షోకు చేసుకున్న శాస్తుర్లుగారి కూతుర్లా వుంటాయి. బైదిబై అప్పలరాజు గారి ఇంగ్లీషు మనవడ్ని పాలేరెంకట సుబ్బడి కూతురి కొడుకు బఫూన్లా ఇమిటేట్ చేసినట్లు. మన బెజవాడను, కోకోనాడాను, రాజహ్మండ్రిని. విశాఖపట్నాన్నీ. చుట్టుప్రక్కల వుండే బడుద్ధాయి గ్రామాలు కామా ల్తోసహా " వూ " చేసి "వూహ్హూ" ఇమిటేట్ చేస్తూంటాయి. కావాలంటే గోహ్‌బ్యాక్ టు విలేజస్.) పట్నం వేసే పోకిరీ వేషాలన్నీ వేయటానికి విలేజస్ ట్రయి చేస్తూ వుంటాయి.

మరైతే దేశానికి నగరం ప్రేయసైతే గ్రామంతల్లిట. ప్రేయసులు తల్లులవుతారు. కొండొకచో తల్లులూ ప్రేయసు లవగల్రు, వైస్‌వెర్సా.

కమింగ్ టు ది సబ్జెట్ - కంట్రీ లైఫ్‌మీద మోజు తగ్గి టౌన్ లైఫ్ మరియు సిటీ లైఫ్‌మీద మోజు పెరగడంతో, జాయింట్లన్నీ ఫట్ ఫట్ మని (ఆంధ్ర తెలంగాణా తగూల్లాగ) ఏకీలు కాకీలు విడిపోయాయి.

పట్టణ నాగరికతొచ్చిపడి మన కంట్రీలైఫ్‌మీద, మన ఓల్డుకష్టమ్స అన్నిటిమీద మాంచి దెబ్బ తీసింది. పిల్లి పాలకుండ తిరగదోసినట్లు మన ట్రెడిషనల్ వాల్యూసన్నీ తిరగబడి నేలపాలయాయి. ది ట్రబుల్ యీజ్ _ (కొత్త కోక కొనుక్కోకుండా పాత కోక విప్పి పారేసినట్టు) కొత్తవి పుట్టుకు రాకుండానే పాతవి పనికిరాకుండాపోయాయి. దేర్‌ఫోర్ అనగా.... ....

వెనకటి రోజుల్లో అంటే భీసీనాటి మాటకాదు నే చెప్పేది. నిన్న మొన్నటి వరకూ ఆస్తిపాస్తుల్లేని హేండ్ టు మవుత్ సంసారాల్లో ఎన్నెన్నో ఇంటిబ్బందులున్నప్పటికీ, వ్యక్తులమధ్య డబ్బుకంటె అపేక్షలూ అంతఃకరణలదీ పైచేయిగా వుండేది. ఆంధ్రావాడి సొమ్ము అరవవాడు తినలేదా — తిన్నాడ్తిన్నాడు. నిన్న మొన్నటిదాకా తెలంగాణావాడి సొమ్ము ఆంధ్రావాడ్తిన్నాడయ్యా, తింటే తిన్నాడుకాని తిన్నది అరిగించుకోలేకపోయాడు. ఆ మాటలా వుణ్ణీండి. తెలుగువాడిసొమ్ము తెలుగువాడే తిన్నాడుకాని, మరో పంజాబీ, గుజరాతీ, సింధీ, యూపీవాడ్తినలేదుకదా! తిన్నది కక్కిద్దాం— ఆ మాటొప్పుగుంటాన్నేను) తమ్ముడి పెళ్ళాన్ని చెరబట్టినందుకే గదా వాలిమీద సుగ్రీవుడు రాంబాణాన్ని ప్రయోగింపించిదీ— అదీ రైటే ........ తమ్ముడి సొమ్ము తిన్డానికి అన్నగారికి హక్కుందయ్యా..,అన్నగార్ని అల్లరిపెట్టడానికి, తిన్నది కక్కించెయ్యడానికీ తమ్ముడికీ హక్కుందయ్యా— అదీ రైటయితే యిది రైటున్నర. మరిప్పుడు, వొరే తమ్ముడూ బుద్ధి గడ్డితిని రామప్పంతులు చేసిన పని చేశాను. ఈ యిల్లు నీదే— నువ్వే అంతా చక్కెపెట్టు. నేనరుగుమీద కూర్చుని పెద్దరికమంతా నీ చేతుల్లో పెట్టి, నువ్వుపెట్టింది తిని తిట్టిందిపడి అహంకారం చంపుకుని బుద్ధిగా మసలుకుంటానొరే— యింటి పెండెకట్టు రెండుగా కోయించకు అని చెప్పడానికింత తాత్సారమేల — ఆంధ్రప్రదేశాన్ని పరిపాలించి అధికార చక్రాన్ని తిప్పడానికి సర్కారువాడెంత తగునో. రాయలసీమవాడెంత తగునో. తెలంగాణావాడూ అంతే తగును.

ఈ మాటెందుకొచ్చిందంటే— విడిపోయే రోజొస్తే అన్నదమ్ములైనా విడిపోతారు. విడిపోవలసిందే — (ఇందిరా గాంధీగారి తాతగారు లేచొచ్చినా, మరా విడిపోయిన జాయింట్లు అతుక్కోడం జరగదుకాక జరగదు) అని యీ మధ్య నెవరో అంటే గుండె గతుక్కుమంది. "మా తెలుగు తల్లికీ మల్లెపూదండ" అనే పాట గుర్తుకొచ్చింది. ఇప్పుడా దిక్కుమాలిన పాటె వరిక్కావాలి? ఎవరికీ అక్కర్లేదు. నా తెలంగాణ

కోటిరత్నాలవీణ అన్నాడు దాశరథి. ఆ రత్నాలెక్కడున్నాయో తెమ్మంటున్నారిప్పుడు. కోటిరత్నాలని ఎందుకన్నావయ్యా బాబూ-- (ఒకటో అరో తగ్గించి చెబితే సరిపోయేది కాదా) రత్నాలు పంచుకోడానికి గద్దెలమీద మారాజులు కత్తుల్ని దూస్తున్నారు.

ముఖ్యమంత్రిమీద పాపం గుఱ్ఱపెత్తుపడింది. తెలంగాణా గుఱ్ఱం పగలో చిక్కుకున్నాడు యిటూ అటూ కదల్టానికిలేకుండా ముఖ్యమంత్రి. గుఱ్ఱం ముందు మంత్రిని తినేస్తుందికదా! ఆ తర్వాత రాజు గుఱ్ఱాన్ని తింటాడు, తినడు అది వేరే సంగతి. చదరంగంలో జంతువుల నడకలు తెలుస్తాయి. రాజకీయాల్లో జంతువుల నడకలూ, ఎత్తులూ పోల్చుకోవడం కష్టమే! ఇద్దరు పోలీసులకి ఒక టోపీలాగ, ఒక జాతికి రెండు రాష్ట్రాలేమిటి? ఒకరు తగ్గాలి అంటే ఎవరూ? పెద్దవాడే తగ్గాలి. మన్నిచూసి ఇండియా అంతా నవ్వుతూంటే? మా తెలుగు తల్లికీ మల్లెపూదండ" అని ఎలా పాడగలం?

కొంచెం ప్రేమ, కొంచెం ఆపేక్ష పిసరంత మంచితనం, కొద్దిగా క్షమ యిలాటి లక్షణాలేవీ మనలో లేవా? మనం మనుష్యులమా కొయ్య బొమ్మలమా-- అప్పారావుగారు "మన వాళ్ళుట్టి వెధవాయలోయ్" అని ఏనాడో అన్నాడుగదా అని, మనం అస్తమానూ దాన్ని రుజూ చెయ్యడానికి సిద్ధమవుతూంటే సిగ్గుగా లేదూ?

రాజకీయాల్లోనూ ప్రణయ రాజకీయాల్లోనూ సిగ్గు పనికిరాదంటారు నిజమే. అది ప్రణయంలో మనోజ్ఞంగా వుంటుంది. ముద్దుగా వుంటుంది. ముచ్చటగా వుంటుంది. కాని ఇదో - ఈ సిగ్గులేనితనం డాంషేంగా వుంటుంది. మనుషులలోని మంచి అంతా ఇగిరిపోయి ఎగిరిపోయాక మనం చచ్చేం బతికేం? అల్ల కాటిమీద కెక్కించిననాడు సర్వపావకుడైన అగ్నిహోత్రుడికి తెలంగాణావాడూ, ఆంధ్రావాడూ ఒకటే! ఖద్దరు జెండా మీదను కప్పుకుని గన్ కారేజిమీద స్మశానానికొచ్చినవాడూ, మునిసిపాలిటీ చెత్తబండీలో తీసికొచ్చిన లేదా తీసుకురాబడినవాడూ ఒక్కటే. వీడు బతికినంత కాలం ఎలా బతికేడు? ఏయే

మంచిపనులు చేశాడు? ఎందరి కుపకారంచేశాడు? ఎవరెవరి కంటతడి తుడిచాడు? యిలా అనుకునేలా తనువు లాగించేయటం ముఖ్యంకాని ఎందరి కొంపలా ర్పాడు? ఎన్ని సంసారాల్లో చిచ్చు పెట్టాడు? ఎందరి ఉపకారులకి అపకారం చేశాడు? ఎందరు మానవతుల్ని అవమానించాడు? ఎన్ని అబద్దాలాడాడు? యిదా ప్రయోజకత్వం?

ఇప్పుడు చెప్పండి— మా తెలుగుతల్లికి మల్లెపూదండ" అని పాడాలంటే ముక్కలు దిగకుండావున్నాయి. మనసులో లేంది పైకి పాడాలంటే కష్టం. పాట రాక గింజుకుంటూంటే మావారు "ముఖ్యమంత్రీ! ముఖ్యమంత్రీ!" అంటూ వచ్చారు. "నాకది కడు ఇన్సల్ట్‌కరంబగు పదమైయెదోచెడున్" అన్నాను. నేను రాజునైతే నువ్వు నాకు మంత్రివి— ముద్దొచ్చే మంత్రివి కనుక ముఖ్యమంత్రి అన్నాను తప్పా.

"అబ్బ, చివాట్లుతినే వుద్యోగం— నాకొద్దు బాబూ" అన్నాన్నేను. మీరు రాజైతే నేను రాణీ అవాలికాని మంత్రేవిటండీ మంత్రీ గింత్రీనూ అన్నాను కంగిస్తూ. నీది చివాట్లుతినే ఉద్యోగమేకదా మంత్రన్నాను నన్ను క్షమించాననవా హృదయదాసీ అన్నారు.

నన్నెప్పుడూ మంత్ర నకండి అది కడుం గడు ఇన్సల్టుకరంబైన పదంబై తోచె— ఏమిటి నీలో నీవేదో పాడుకుంటున్నావ్— అన్నారు. మా తెలుగు తల్లికి మలెపూదండ అన్నపాట జ్ఞాపకం చేసుకుంటున్నాను సార్ అన్నాను. జ్ఞాపకంచేసుకోకు అన్నారు గంభీరంగా మొహంపెట్టి..

ఇంట్లో చప్పుడ యింది. పిల్లి పాలగిన్నెను తిరగదోసింది. లేవేం అన్నారు శ్రీవారు. లేవలేనన్నాను. మొండితనంకాదు. దేశంలోని ట్రాజిడివలన కలిగిన ఒక ఫీలింగు. పిల్లి మూతి నాక్కుంటూ మా ముందునుంచే వెళ్తోంది. దాన్ని ఓ పెయ్యండి రాయుచ్చుకుని అన్నాను. "మీదబడి పీకుతుందే" అన్నారు. నాకు నవ్వొచ్చింది, ఏడుపొచ్చింది, చిరాకొచ్చింది, కోపమొచ్చింది. 'గెటవుట్' అన్నాను. మావారు వెళ్ళిపోయారు. లోపలకెళ్ళి స్టాండపాంది బెంచి అన్నాను. మావారు బెంచీ మీదెక్కి నిల్చున్నారు. నేనూ వెళ్ళి వారి ప్రక్కన నిలబడ్డాను.